
www.prajasakti.com
# ప్రజాశక్తి
శనివారం 12 జులై 2025
5
వైఎస్ఆర్



## పీజీ పరీక్షలు ప్రారంభం

**ప్రజాశక్తి కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల అనుబంధ పీజీ కళాశాలల రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. వైవీయూ పీజీ కళాశాల కేంద్రాన్ని వారు సందర్శించారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 653 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కడప ఎస్.వి. పీజీ కళాశాలలో, ప్రొద్దుటూరులోని ఎస్‌సిఎన్ఆర్ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. విశ్వవిద్యాలయం నుంచి ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను పంపామని, ప్రత్యేకంగా హై పవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

# 'అన్నమయ్య'కు ఆమోదం లభించేనా?

- నేడు సిడబ్ల్యుసి, డిజైనింగ్ నిపుణుల పరిశీలన
- త్వరలో తుది నివేదిక అందజేత



**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణకు కసరత్తు తుదిదశకు చేరుకోనుంది. దేశంలోనే అత్యున్నత నీటిపారుదలశాఖ నిపుణుల బృందమైన సెంట్రల్ ప్లానింగ్ కమిషన్, డ్యామ్ డిజైన్ ఎక్స్‌ఫర్ట్ కమిటీకి చెందిన ఆరుగురు నిపుణుల బృందం శని, ఆదివారం అన్నమయ్య రిజర్వాయర్‌ను సందర్శించనుంది. అన్నమయ్య రిజర్వాయర్ ఇంజినీరింగ్ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. 2021 నవంబర్ 19, 20 తేదీల్లో జవాద్ తుఫాన్ ధాటికి అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట పూర్తిగా తెగిపోవడంతో నామరూపాలు లేకుండా పోయిన సంగతి తెలిసిందే. ఇందులో డ్యామ్ కట తెగిన ప్రాంతంలోనే డ్యామ్‌ను పునరుద్ధరిం చాలా, తెగిన కట్టకు సమీపంలో రెండు చోట్ల పడిన గండ్లను ఎలా పూడ్చాలి, మూడు టిఎంసిల నిల్వ స్థానంలో ఎనిమిది టిఎంసిల నిల్వ చేయాలా లేదా, కాంక్రీట్ డ్యామ్ నిర్మాణమా, లేక మట్టి కట్టలతోనే నిర్మించాలా, మట్టి కట్టల నిర్మాణం చేపడితే డ్యామ్ పటిష్టత ఎలా ఉంటుందనే పలు అంశాలను కూలకషంగా అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం పూర్తిస్థాయిలో సర్వే చేసిన అనంతరం ప్రభుత్వానికి తుది నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఇంజినీరింగ్ నిపుణుల తుది నివేదిక ఆధారంగా అన్నమయ్య రిజార్వయర్ పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 2021 నుంచి జిల్లా నీటిపారుదలశాఖ, విజయవాడకు చెందిన హైడ్రాలజీ, డిజైనింగ్, ఇతర ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన ఇంజినీరింగ్ నిపుణులు, ఉన్నతాధికారులు పలు మార్లు పరిశీలించిన సంగతి తెలిసిందే. అనేక వడపోతల ఓ ప్రయివేటు ఏజెన్సీ సహాయంతో ప్రతిపాదనలను సైతం తయారు చేయించారు. అనంతరం జిల్లా నీటి పారుదలశాఖ రూపొందించిన రూ.787.77 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం రివర్స్‌టెండరింగ్ ప్రక్రియను సైతం పూర్తి చేసి జిఒ ఆర్‌టి -2076ను జారీ చేసింది. అన్నమయ్య రిజర్వాయర్‌ను కాంక్రీట్‌తో నిర్మించడంతోపాటు 10 గేట్ల ద్వారా ఐదు లక్షల నుంచి ఎనిమిది లక్షల క్యూసెక్కుల వరద డిశ్చార్జి సామర్థ్యంతో నిర్మించనున్నట్లు తెలిపింది. ఇంతలో 2024 సార్వత్రిక ఎన్నికలు రావడంతో వ్యవహారం మొదటికి వచ్చి ంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మరోసారి సిడబ్ల్యుసి, డ్యామ్ డిజైనింగ్ తది తర ఆరుగురు నిపుణులతో సర్వే చేయించిన అనంతరం అందిన నివేదిక ఆధారంగా అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశం ఉందనే వాదన ఇంజినీరింగ్ వర్గాల నుంచి వినిపిస్తోంది.

# గంజాయి నిర్మూలనే లక్ష్యంగా కఠిన చర్యలు

**- ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అశోక్ కుమార్

జిల్లాలో గంజాయి నిర్మూలనకు పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాను గంజాయి, ఇతర నిషేదిత మత్తు పదార్థాల రహితంగా చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గంజాయి సేవించే అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఆచూకీ కనుగొని వారి కుటుంబసభ్యుల కు అప్పగించాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే మహిళలు, ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమస్యను సావధానంగా విని విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. వైన్ షాపులవద్ద నిబంధలకు విరుద్ధంగా అనధికారిక పర్మిట్ రూమ్‌లలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. జిల్లాలోని పట్టణాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్స్ విస్తృతంగా నిర్వహించాన్నారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డాబాలు, హోటళ్లు, లాడ్జిలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలూ, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి గస్తీ ని పెంచాలని ఆదేశించారు. గతంలో చోరీ కేసుల్లో సొత్తును త్వరితగతిన రికవరీ చేయాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని, మరోమారు నేరాలకు పాల్పడకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, మహిళా పిఎస్ డిఎస్‌పి ఇ.బాలస్వామి రెడ్డి, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డిఎస్‌పి పి.భావన, మైదుకూరు డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్, జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర రావు, పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్, జిల్లాలోని సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణకు 16 నూతన ద్విచక్ర వాహనాలు**

ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఒక బుల్లెట్ వాహనం, 15 - అపాచి ఆర్‌టిఆర్ ద్విచక్ర వాహనాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిపి కార్యాలయం మంగళగిరి నుంచి వచ్చిన ఈ వాహనాలకు సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. జిల్లాలోని కడప ట్రాఫిక్ పిఎస్‌కు ఏడు, ప్రొద్దుటూరు ట్రాఫిక్ పిఎస్‌కు 4, పులివెందుల ట్రాఫిక్ పిఎస్‌కు 2, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలుకు ఒకొక్కటి చొప్పున నూతన వాహనాలు కేటాయిస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని భావిస్తున్నామన్నారు.

**డ్రోన్ కెమెరాలతో శక్తి టీమ్‌ల నిఘా**

నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆటకట్టించేందుకు ఎస్‌పి ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. శుక్రవారం శక్తి టీముల ఆధ్వర్యంలో ఆయా కళాశాలలు, పాఠశాలల వద్ద బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై దృష్టి సారించారు. మహిళలను వేధించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. మహిళల భద్రత, శాంతి భద్రతలను కాపాడేందుకు కడప జిల్లా పోలీసులు నిరంతరం విజిలెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ శ్రీనివాసులు, 'శక్తి' టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచకపోతే
# నిరవధిక సమ్మె తప్పదు

**- బైక్ ర్యాలీలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి**

**ప్రజాశక్తి - కడప అర్బన్**



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచకపోతే నిరవధిక సమ్మె తప్పదని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనల పెంపు కోసం 6 సంవత్సరాల నుంచి పోరాటం కొనసాగుతూ ఉందని తెలిపారు. జీవో నంబర్ 36 ను అమలు చేయకుండా ప్రభుత్వం చర్చ లతో కలా యాపన చేస్తుందని విమర్శించారు. ఈనెల 12 అర్ధ రాత్రి నుంచి వాటర్, లైట్టింగ్, టౌన్ ప్లానింగ్ కార్మికులందరు, అన్ని వింగ్స్ వారు నిరవధిక సమ్మె లోకి వెళతారని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షం లో అన్ని సేవలు బంద్ అవుతాయని స్పష్టం చేశారు. అమినేటిస్ సెకరెట్రీల తో నీళ్ల విడిపించి ప్రజలకు ఇవ్వాలి అని చూస్తున్నారని, వారు తెలియక వేరు వాలు తిప్పి వాటర్ లైన్ పోతే దానికి అధికారులే బాధ్యతని హెచ్చరించారు. ప్రజలు ఇబ్బందులకు గురైతే దానికి ప్రభుత్వం దే బాధ్యతని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే మాధవి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. తల్లికి వందనం వర్తింపజేయాలని చెప్పారు. రూ.25000 లోపు ఉన్న అవుట్ సోర్సింగ్ వారికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని తెలిపారు. రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చల ద్వారా కార్మికుల న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు ఎం.ఆనంద్ రావు, బ్రహ్మానందరెడ్డి, పర్మినెంట్ నాయకులు కొండయ్య, మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి, ఇంజినీరింగ్ నాయకులు, సుబ్బారాయుడు, గురువయ్య, రాంమోహన్ రెడ్డి, శరత్, శ్రీకాంత్, రాజా, ప్రవీణ్, పాలకొండయ్య, ఆంజనేయులు, శ్యాం బాబు, సుబ్బయ్య, లోకేష్, గోవర్ధన్, చెంద్రయుడు, సత్యనారాయణ, యల్లయ్య, జయపుత్రుడు, బద్రి, వెంకటేష్, దేవా, సుబ్బయ్య, లక్షుమయ్య, నారాయణ, సుబ్బారాయుడు, శివ,రాజా,చిన్న రెడ్డయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అందజేయాలి

**ప్రజాశక్తి - కడప**



మాట్లాడుతున్న మామిళ్ళ బాబు

తల్లికి వందనం షరతులు లేకుండా ప్రతి విద్యార్థికీ అందచేయాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తల్లికి వందనం కొంత మంది విద్యార్థులకే అందుతుందన్నారు. విద్యార్థులను మోసం చేయడంలో నాడు వైసిపి ప్రభుత్వం, ఇప్పుడు టిడిపి ప్రభుత్వం రెండు దొందూ దొందే అని అన్నారు. అప్పుడు వైసిపి ప్రభుత్వం లో విద్యార్థుల దగ్గర నుండి రెండు వేలు నొక్కారు, ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం కూడా రెండు వేలు రూపాయలు విద్యార్థుల సొమ్మును దోచుకోవడం మరీదారుణం అన్నారు. చాలా ప్రభుత్వ పాఠశాలలో ప్లేగ్రౌండ్, తాగేందుకు నీరు లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వెంటనే కూటమి ప్రభుత్వం షరతులు లేకుండా ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యుఐ విద్యార్థి విభాగం తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

## చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం

**ప్రజాశక్తి - కడప :** తల్లికి వందనం పథకం నారా లోకేష్ మైండ్ నుండి వచ్చిన పథకం అని చంద్రబాబు నాయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్న రీతిలో చంద్రబాబు నాయుడు ప్రవర్తన ఉందన్నారు. శుక్రవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరెంట్స్ మీటింగ్‌లోహెం హోదాలో చంద్రబాబు మొత్తం అబద్ధాలు చెప్పారన్నారు. అమ్మ ఒడి పథకం తెస్తామని 2014 ఎన్నికల ప్రచారం సమయంలోనే వైఎస్ జగన్ చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చాక అమ్మఒడి ద్వారా తల్లులకు డబ్బులు జగన్మోహన్ రెడ్డి అందించారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైయస్ జగన్ కే దక్కుతుందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు. వెన్నుపోటు రాజకీయాలు, మోసాలు,అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు. వైఎస్ జగన్ తెచ్చిన పథకాలను ప్రజలు జీవిత కాలం మర్చిపోరని అన్నారు.

## రిమ్స్‌లో అన్నదానం

**ప్రజాశక్తి - కడప అర్బన్**



అన్నదానం చేస్తున్న చంద్ర ఓబుల్ రెడ్డి

కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తండ్రి శివానందరెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం రిమ్స్‌లో అన్నదానం నిర్వహించారు. గత సంవత్సరం నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం తమ వారి వైద్య సహాయార్థం వచ్చిన వారికి అన్నదానం చేశారు. డబ్బు సరిపోక ఇబ్బంది పడే వారికి సమయానికి ఆహారం అందించాలనే ఉద్దేశంతో వారి ఇబ్బందులను గమనించి కార్యక్రమాన్ని తాము ప్రారంభించినట్లు చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. ప్రతీ వారం సుమారుగా 1000 భోజన పొట్లాలు, మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తమ విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థులు స్వచందంగా ముందుకు వచ్చి భోజనం ప్యాకెట్ అందించడంలో సహరికస్తున్నారని చెప్పారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - కడప** : కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈనెల 12న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కడప టూటౌన్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. లక్షారెడ్డి ఒక ప్రకటనలో పర్కొన్నారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి భార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులకు కలిగే ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్నకు ప్రశంసా పత్రం

**ప్రజాశక్తి - వల్లూరు :** దొంగతనం కేసుల్లో చోరీ సొత్తు రికవరీ చేసిన వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్నను ఎస్‌పి అశోక్ కుమార్ అభినందించారు. శుక్రవారం కడప ఎస్‌పి కార్యాలయంలో ఎస్ ఐ పెద్ద ఓబన్నకు ప్రశంస పత్రం, నగదు రివార్డులు అందజేశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ వల్లూరు పోలీస్ సిబ్బంది చాకచక్యంగా చైన్స్ స్నాచింగ్ చేసే దొంగలను పట్టుకుని రికవరీ చేయడం అభినందనీయమన్నారు. మండల వ్యాప్తంగా చోటు చేసుకోకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి తెలిపారు.

## ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాలు విజయవంతం

**ప్రజాశక్తి-కమలాపురం**

నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా స్టెప్ సిఇఒ సి.సాయిగ్రేస్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, స్టెప్, కడప, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డి. సత్యనారాయణ రెడ్డి, మదర్ థెరిసా సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ హాజరయ్యారు. సి.సాయిగ్రేస్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరంగా ఉండే యువత రక్తదానం చేయొచ్చని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల పాత కణాలు పోయి కొత్త కణాలు రావడంతో ఎంతో ఆరోగ్యకరంగా ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు స్వచ్ఛందంగా 25 మంది రక్తదానం చేశారు.

## పిఎల్ఐలో నూర్ అహమ్మద్ ప్రతిభ

**- అభినందించిన సూపరింటెండెంట్ రాజేష్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**



ప్రతిభ సర్టిఫికెట్ అందిస్తున్న సూపరింటెండెంట్ రాజేష్

కడప ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన సేల్స్ అడ్వైజర్ డైరెక్టర్ ఎస్.నూర్ అహమ్మద్‌ను సూపరింటెండెంట్ రాజేష్ అభినందించారు. శుక్రవారం తపాలా కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ సర్టిఫికెట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రజల ఆర్థిక భద్రతను అందించే ప్రముఖ బీమా పథకం అన్నారు. ఇది ప్రభుత్వ హామీతో ప్రజలకు విశ్వసనీయమైన, స్థిరమైన సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాలసీని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్‌పిఒలు విజయ భాస్కర్, విజయభాస్కర్ రెడ్డి, నాగూర్ రెడ్డి, బాష, పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్ పాల్గొన్నారు.

# రిమ్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**





రిమ్స్‌లో పర్యటిస్తున్న సిపిఎం నగర కమిటీ నాయకులు

కడప జిల్లా అధికార యంత్రాంగం రిమ్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో రిమ్స్‌లో పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన సమస్యలపై త్వరలో అధికారులకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఉపయోగించేలా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంచినీరు కావాలంటే క్యాంటిన్ల దగ్గరికి వెళ్లి రూ.20 చొప్పున కొనుక్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇది ప్రజలకు భారంగా మారుతోందన్నారు. రిమ్స్ బయట ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో, కొన్ని క్యాంటీన్లు నెలలో 15 రోజులు, ఇంకొన్ని క్యాంటీన్లు 15 రోజులుగా విడగొట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీని కారణంగా సామాన్య ప్రజలు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ఈ పద్ధతిని రద్దుచేసి అన్ని రూములలో వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ట్యాంకుల నిర్వహణను మెరుగుపరచాలని చెప్పారు. భవన నిర్మాణంలో పైపులు లీకేజీ కారణంగా బాగా దెబ్బతింటున్నాయని, వాటిని తక్షణమే రిపేర్లు చేసి భవన నిర్మాణాలు దెబ్బతినకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కాన్పుల వార్డు వద్ద లక్షల రూపాయలు ఖర్చుపెట్టి విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారని, దాన్ని వినియోగంలోకి తీసుకు రాకపోవడం వల్ల అది తుప్పు పట్టే ప్రమాదం ఉందని చెప్పారు. దానిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పేషంట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఒక మంచి నీటి ట్యాంకు సరి పోవడం లేదని, మరొక ట్యాంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడానికి జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యటనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరి రెడ్డి, పార్టీ నాయకులు నరసింహ, జార్జి, తిమ్మయ్య పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి - కడప :** ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ కడప యాజమాన్యం సెక్రటరీ జవాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్ధవటం గంగమ్మ గుడి వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఇఎన్టి, డెంటల్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వైద్య సేవలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సిద్ధవటం గ్రామం మరియు పరిసర ప్రాంతాల నుండి సుమారుగా 200 మందికి పైగా ప్రజలు పాల్గొని ఉచితంగా వైద్య సేవలను పొందారు. కార్యక్రమంలో ఫాతిమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాశ్రమానికి విజయజ్యోతి వితరణ

**ప్రజాశక్తి-కాశినాయన :** సేవాశ్రమాలు నడపడం అంటే చాలా పట్టుదలతో కూడిన పని అని డిసిసి అధ్యక్షులు ఎన్.డి విజయ జ్యోతి పేర్కొన్నారు ఆమె శుక్రవారం పరిధిలోని దిక్కు మొక్కు లేని అనాథలను ఆదుకుని, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న వివేకానంద సేవాశ్రమానికి రూ. 22 వేలు విలువగల 18 రేకులను వితరణ చేశారు. సేవాశ్రమం వార్షికోత్సవం పురస్కరించుకుని చేపట్టిన పనుల్లో భాగంగా తన వంతు సాయం చేశానని విజయ జ్యోతి పేర్కొన్నారు.

## హామీలన్నీ అమలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం హామీలన్నీ అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. శుక్రవారం 30 వ డివిజన్ పాలెం పాపయ్య వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల అమలుపై వివరించారు. దీపం 2 పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి వినియోగదారునికి ఇంటికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయని చెప్పారు. పెంచిన పెన్షన్లు ఒకటో తారీకు, ఆదివారం అయితే ఒకరోజు ముందే అందిస్తున్న ప్రభుత్వం ఒక్క కూటమి ప్రభుత్వమే అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చిందని ఆమె గుర్తు చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా చదువుకుంటున్న పిల్లలందరికీ, ఒక్కొక్కరికి రూ.13000 తల్లుల బ్యాంక్ ఖాతాలో జమ చేశారని తెలిపారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్న ఉద్దేశంతోనే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. సంక్షేమ కార్యక్రమాలను, జరగబోయే అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ముందుగా డివిజన్‌కు చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.

# వైభవంగా సౌమ్యనాథ స్వామి కల్యాణం



సౌమ్యనాథుని కల్యాణంలో మాంగల్యం చూపుతున్న ఆగమశాస్త్ర పండితులు

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాధుని కల్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కల్యాణం చూడముచ్చటగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యాణ వేదికను అలంకరించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సునీల్ కుమార్, సాయి స్వామి శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కళ్యాణ వేదికపైన ఆశీనులు గావించారు. పండితుల మంత్రోచ్చారణలు, వ్యాఖ్యానంతో భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఉదయం కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు. రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్‌రెడ్డి పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులకు అందజేశారు. వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**కల్యాణానికి హాజరైన ప్రముఖులు:** సౌమ్యనాథుని కళ్యాణ మహోత్సవానికి ఆర్‌టిసి మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, జనసేన నాయకులు ఎల్లటూరి శ్రీనివాసరాజు, సమ్మెట శివప్రసాద్, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయ సాగర్ హాజరయ్యారు.

**భక్తులకు అన్నదానం :** కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు ప్రముఖ పారిశ్రామికవేత్త సోముల రాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సిఐ బి.వి.రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు. కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామిని ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించి అనంతరం మాడవీధుల్లో భక్తులకు శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు దర్శనమిచ్చారు.

**గజవాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు :** శ్రీసౌమ్యనాథ స్వామి రాత్రి గజ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కలను తీర్చుకున్నారు.

**భక్తులకు ఉచిత ఆటో సర్వీస్:** సౌమ్యనాథ స్వామి కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం జనసేన నాయకులు అతికారి కృష్ణ సహకారంతో నందలూరు జనసేన నాయకులు అరుణ్ పాండే, శివ, మండెం రాము ఆధ్వర్యంలో ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు.

**బ్రహ్మోత్సవాలలో నేడు:** బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు టిటిడి అధికారులు ఏర్పాట్లు చేశారు. రథంపై శ్రీదేవి భూదేవి సమేత సౌమ్య నాధుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.


బదిలీ అయిన సచివాలయం సిబ్బందిని సన్మానిస్తున్న జి.నాగిరెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ

## ప్రజాసేవతో మన్ననలు పొందాలి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మంచి సేవలు అందించి మన్ననలు పొందాలని, అప్పుడే ప్రజల మనసులో శాశ్వతంగా గుర్తుండి పోతారని వైసిపి మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు జి.నాగిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.కొత్తపల్లె సచివాలయంలో విధులు కొనసాగిస్తూ బదిలీ అయిన డిజిటల్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, ఎఎన్ఎం వెంకటసుబ్బమ్మ, గ్రామ సర్వేయర్ అశోక్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా బి.కొత్త పల్లె సర్పంచ్ గంగిరెడ్డి సుబ్బమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మంచి సేవలు అందించి వారి మన్ననలు పొందారని, ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం కార్యదర్శి నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానం పొందిన సచివాలయ సిబ్బందితో టిడిపి నాయకులు

**చాపాడు :** మండల పరిధిలోని పల్లవోలు సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన సిబ్బందిని శుక్రవారం టిడిపి నాయకులు రామాంజనేయులు, రామ్మోహన్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిదేళ్లుగా గ్రామ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. వారి సేవలను కొనియాడుతూ శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడిగా హరినాథ్‌రెడ్డి

**ప్రజాశక్తి - ఖాజీపేట**



ఖాజీపేట అగ్రహార వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా త్రిపురవరం గ్రామానికి చెందిన హరినాథరెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు శుక్ర వారం జిల్లా అధికారులు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యా దవ్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు, సొసైటీని లాభాల బాటలో పయనించడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి రైతుకూ మెరుగైన సేవలు అందేలా చూస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


సాంబశివారెడ్డి

**బ్రహ్మంగారిమఠం :** సోమిరెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కమిటీ చైర్మన్‌గా ఎల్లటూరు సాంబశివారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన సోమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు. సాంబశివారెడ్డి నియామకం పట్ల సోమిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ గ్రామాల ప్రజలు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు సొసైటీ చైర్మన్ నియామకానికి పూర్తిగా సంపూర్ణంగా సహకరించిన పుట్ట సుధాకర్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎపి రవీంద్ర, మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతిరోజు రైతుల మధ్య ఉండి వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.


నరసింహారెడ్డి

**చాపాడు :** మైదుకూరు నియోజకవర్గ పరిధిలో కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టింది. మైదుకూరు సొసైటీ చైర్మన్‌గా పాశం మారుతి కుమార్, చాపాడు మండలం అల్లాడుపల్లి సొసైటీ చైర్మన్‌గా ఎం.నరసింహారెడ్డి, ఖాజీపేట మండలం అగ్రహారం సొసైటీ చైర్మన్‌గా జీఆర్ హరినాథ్‌రెడ్డి, బ్రహ్మంగారిమఠం సోమిరెడ్డిపల్లె సొసైటీ చైర్మన్‌గా వై.సాంబశివారెడ్డి, దువ్వూరు సొసైటీ చైర్మన్‌గా పి.రామమోహన్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేశారు. త్రిసభ్య కమిటీ మెంబర్లు సొసైటీలను పర్యవేక్షించనున్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య సూచించారు. ప్రతి శుక్రవారం డ్రయుడే పాటించాలని సూచిస్తూ శుక్రవారం పట్టణ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ప్రభావం, నివారణ పద్ధతులు, ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి, లార్వా నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, లక్ష్మి, స్వర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విభజన హామీల అమలు కోసం18న చలో ఢిల్లీ

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాల శివకుమార్**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

విభజన హామీల అమలుకు ఈనెల 28న చలో ఢిల్లీ చేపట్టినట్లు, కడప ఉక్కు సాధన కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాల శివకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను విస్మరించిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం పాలక ప్రభుత్వాలు పోటీ పడి ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు ఇచ్చాయని తెలిపారు. అవేవీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, సభ్యులు రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు

**వేముల :** స్థానిక దుగ్గనగారిపల్లె గ్రామ సమాఖ్య పరిధిలో డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, ఇన్సూరెన్స్ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఏపీజీవీ వేముల బ్రాంచ్ మేనేజర్ జయచంద్ర మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ నాగేశ్వర్, గ్రామ సమాఖ్య అసిస్టెంట్ గంగా సౌజన్య, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**ముద్దనూరు :** కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని ఉమ్మారెడ్డిపల్లె గ్రామ సమీపం వద్ద శుక్రవారం ఈర్ల దేవమ్మ అనే వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. ఆ మేరకు స్థానికులు తెలిపారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చికిత్స అనంతరం కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు.

# ఆటోస్టాండ్ స్థలంలో గుంతలు తీయడం అన్యాయం


ధర్నా చేస్తున్న ఆటో యూనియన్, సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆటో కార్మికుల స్టాండ్ స్థలంలో గుంతలు తీయడం అన్యాయమని సిఐటియు గౌరవ అధ్యక్షులు జి.ఏసుదాసు తెలిపారు. ఇందుకు నిరసనగా శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 కుటుంబాల ఆటో కార్మికుల జీవనోపాధి ఆటోస్టాండ్ అన్నారు. దీన్ని కొట్టేయడం అన్యాయమన్నారు. 1994 నుంచి ఇక్కడే ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకొని కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఇలా రాత్రికి రాత్రే కార్మికుల కడుపు కొట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆటో కార్మికుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఆ పనులు ఆపాలని కోరుతున్నామన్నారు. అభివృద్ధి అంటే ఆటో కార్మికుల జీవనోపాధిని తీసేయడం కాదన్నారు. ఆటో కార్మికులకు పాత బస్టాండులో ఉన్న స్థలాన్ని వారికే కేటాయించి వారిని ఆదుకోవాలని సూచించారు. ఆటో కార్మికుల ప్రతిరోజు మున్సిపల్ అభివృద్ధికి టోల్‌గేట్ చెల్లిస్తున్నారని తెలిపారు. ధర్నా వద్దకు చేరుకున్న జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి కార్మికులతో మాట్లాడారు. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేపరాల, మైలవరం స్టాండ్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి కుటుంబ నియంత్రణ పాటించాలి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

చిన్న కుటుంబం-చింతలేని కుటుంబమని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మా సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కరిష్మా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పాత బస్టాండ్ వరకు ఆశా కార్యకర్తలు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్ యాదవ్, విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకులు రామారావు, జయమ్మ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ జయాకర్, ప్రజలు పాల్గొన్నారు.

**ఖాజీపేట :** ప్రతి ఒక్కరూ దేశ జనాభా నియంత్రణ కోసం కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రీతి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అధిక జనాభా వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతుల్ని చేస్తూ ప్రదర్శన నిర్వహించినారు. తక్కువ జనాభాతో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చాపాడు :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, కావ్య మాధురి, ఓబులేష్, సిహెచ్‌ఓ మహదేవ్ యాదవ్, సబ్ యూనిట్ ఆఫీసర్, శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు బాబురెడ్డి, లక్ష్మీదేవి, ప్రసాద్, భాస్కర్, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

**వేంపల్లె :** జనాభా పెరగడం వల్ల సహజ వనరుల కొరత ఏర్పడుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కుటుంబ నియంత్రణను ప్రతి ఒక్కరూ పాటించాలని డాక్టర్ పృథ్వీ కుమార్ రెడ్డి సూచించారు. తాళ్లపల్లె పరిధిలోని వేంపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి, డాక్టర్ శాంతి, డాక్టర్ నిహారిక, సిహెచ్‌ఓ వెంకటరత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం, ఎంపిహెచ్ఇఓ ఫకృద్దీన్, సూపర్‌వైజర్ అరుణదేవి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

**వేముల :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ శరణ్య, డిప్యూటీ ఆరోగ్య వైద్యాధికారి ఉషారాణి, సిహెచ్‌ఓ అరుణకుమారి, ఆరోగ్య వైద్యాధికారి ఉషారాణి, సూపర్వైజర్ విజయలక్ష్మి, రమేష్, శ్రీనివాసులు, పిహెచ్‌సి సిబ్బంది, ఏంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఓలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు :** బిడ్డకు.. బిడ్డకూ మధ్య ఎడమ ఉండాలని వైద్యాధికారి డాక్టర్ హిమబిందు సూచించారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ వల్లంకొండు అనూష, సొసైటీ అధ్యక్షులు ఎన్వి సుబ్బారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# అంతర పంటలపై దృష్టి సారించాలి


రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారులు

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

మైదుకూరు మండలం నంద్యాలంపేట గ్రామ పరిధిలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు శుక్రవారం సందర్శించారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలలో అంతర పంటలు వేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. అంతర పంటలు సాగు చేసుకోవాలన్నారు. వివిధ పంటల గురించి రైతులతో చర్చించారు. సాగు చేసే ప్రతి పంటను ఇ-పంటలో నమోదు చేయాలని ఉద్యాన సహాయకులకు సూచించారు .బిందు సేద్యంలో ఆటోమేషన్ గురించి రైతులతో చర్చించారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ రైతు బీరం వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి పి.రవి చంద్రబాబు, జిల్లా సూక్ష్మ నీటిపారుదల పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. వెంకటేశ్వర్ రెడ్డి, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ పిఎం కొండారెడ్డి, మైదుకూరు ఉద్యాన అధికారి సి రామకృష్ణ, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

**లింగాల :** రైతులు సాధారణ పంటలు చేయకుండా నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించి ఆయిల్ ఫామ్ పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి సూచించారు. మండల పరిధిలోని వెలిదండ్ల రైతు సేవా కేంద్రంలో ఆయిల్ ఫామ్ సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగుకు అనుకూలంగా ఉందని శాస్త్రవేత్తల అధ్యయనం చేశారన్నారు. పంట సాగుకు అనుకూలం అని నివేదిక అందజేశారన్నారు. రెండున్నర (హెక్టార్)కు రూ. 29,000 పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. నాలుగేళ్ల పాటు అంతర్ పంటల సాగుకు రూ. 10,500 పెట్టుబడి ప్రభుత్వం చెల్లిస్తుం దన్నారు. మొక్క జీవిత కాలం 35 నుంచి 40ఏళ్లు పంట దిగుబడి వస్తుందనివివరించారు. గ్రామంలో రాజారెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల యాభై సెంట్లులో ఆయిల్ ఫామ్‌ను సాగు చేశాడు. కార్యక్రమంలో ఎంపిపి రమాదేవి, ఎంకే అగ్రోటెక్ స్టేట్ హెడ్ మురళి, రైతు సేవా కేంద్రం సిబ్బంది జగదీశ్వరరెడ్డి, హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.


వెలిదండ్లలో అయిల్ ఫామ్ మొక్కలు నాటుతున్న రాఘవేంద్రరెడ్డి


కళావతిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

## దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేయాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

పెద్దశెట్టిపల్లె పబ్లిక్ రోడ్డు విషయమై గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన కళావతిపై దాడి చేయడం ఆమానుషమని, రాళ్లతో దాడి చేసిన వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన కళావతి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా విజయ్‌కుమార్, సిఐటియు నాయకులు సాల్మన్, రాఘవ మహిళా సంఘం నాయకులు విజయకుమారి పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ రెండు నెలల నుంచి తాలూకా సిఐ మహిళలని కూడా చూడకుండా రాత్రి తొమ్మిది గంటల వరకు వీరిని స్టేషన్ల చుట్టూ తిప్పుకుంటూ దాడి చేసిన వెంకటసుబ్బయ్య కుటుంబానికి అండగా నిలిచారని ఆరోపించారు. కళావతి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, ఆ పబ్లిక్ రోడ్డులో ప్రజలందరిని తిరగనివ్వాలని, తాలూ కా పోలీసుల తీరుతో చాలామంది గొడవలు పడుతున్నారని, ఒకరకంగా చూస్తే గొడవలకు వీరే కారణం అవుతున్నారన్నారు. దాడులు చేయడం మంచి పద్ధతి కాదని, శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

## న్యాయమైన ధర చెల్లించాలని వినతి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

డీ మార్ట్ వద్ద ఉన్న భూములకు న్యాయమైన ధర చెల్లించాలని పలువురు రైతులు, స్థల యజమానులు కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని కోరారు. ఆ మేరకు శుక్రవారం వారు ఆయనకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం భూములు తమ పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం కొనుగోలు చేశామన్నారు. మంచి ధర వస్తే వీటిని విక్రయించి తమ కుటుంబాల అవసరాలు తీర్చుకుంటామని తాము ఇన్నాళ్లు చూశామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ప్రభుత్వానికి సంబంధించి తమ భూములు ఉపయోగపడుతుండడంతో తమ భూములకు అతి తక్కువ రేటు ప్రకటించడం సరికాదన్నారు. గతంలో డీ మార్ట్ నిర్మాణానికి ముందు దాదాపు రూ.20లక్షల నుండి రూ.30 లక్షల దాకా రేట్లు పలికాయన్నారు. ప్రస్తుతం అతి తక్కువ ధరకు తమ భూమికి రేటు కేటాయించడ న్యాయం కాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులను కలిసినా తామేమి చేయలేమని చెప్పడం విచారకరమన్నారు. తమ స్థలాలకు న్యాయమైన ధర చెల్లించకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తమ కుటుంబాల వీధిన పడే ప్రమాదం ఉందన్నారు. స్పందించిన కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భూములకు మంచి విలువ ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.జిలాని బాషా, బి.మదన్‌బాబు, ఎం.నారాయణ, అబ్దుల్ ఖాదర్, ఎస్.నాగసుధ, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, రమణ, గీతాబాయి, మనోహన్‌రెడ్డి, శ్రీరాముల వెంకటేశ్వర్లు, గాజులపల్లె రామయ్య, ఎన్.మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## విద్యాసామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండల పరిధిలోని సుంకేసుల దళితవాడలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల ఐటిడిపి నాయకులు పాపన మల్లికార్జునరెడ్డి విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిటిడి ఆర్థిక సహకారంతో సుంకేసుల ఎస్సీ కాలనీలో రామాలయం నిర్మించారన్నారు. వ్యాస పౌర్ణమి రామాలయ ఆవరణలో బాల వికాస స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అట్టలు అందజేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, బాలవికాస్ జిల్లా ఉపాధ్యాయ సంయోజన్ లక్ష్మీనారాయణ రెడ్డి, అర్చక స్వామి వెంకటేష్, కమిటీ సభ్యులు తిరుపాలయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పర్మినెంట్ స్టాపింగ్ ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

తిరుపతి-గుంటూరుకు వెళ్ళే రైలుకు జమ్మలమడుగులో పర్మినెంట్ స్టాపింగ్‌కు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి నుండి గుంటూరుకు వెళ్లే రైలు జమ్మలమడుగులో స్టాపింగ్ కొద్ది రోజులు ఏర్పాటు చేశారని, ఇది చాలామంది ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. ప్రస్తుతం రైల్వే అధికారులు జమ్మలమడుగులో ఆ రైలుకు జమ్మలమడుగులో స్టాపింగ్ లేదని చెబుతున్నారన్నారు. రైల్వే అధికారులు పునరాలోచించి తిరుపతి-గుంటూరు రైలు జమ్మలమడుగులో స్టాపింగ్ పర్మినెంట్ చేయాలని ప్రజల ఆకాంక్షగా వివరించారు. డిఐఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ పాల్గొన్నారు.

## జనాభా పెంచాలని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరం

**పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి**

**వేంపల్లె :** ఎక్కువ మంది పిల్లల్ని కనండి జనాభా పెరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం విడ్డూరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. 1990 జూలై 11న మొట్టమొదట ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దినంగా ప్రకటించిందన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కలిగించడం ప్రపంచ దినోత్సవ లక్ష్యమన్నారు. ప్రపంచంలో 242 దేశాలు ఉన్నాయన్నారు. ప్రపంచ జనాభా 809 కోట్లు అన్నారు. ఇందులో భారత్ జనాభా 144 కోట్లు కాగా చైనా జనాభా 142 కోట్లు ఉన్నట్లు చెప్పారు. అమెరికా జనాభా 34 కోట్లు అన్నారు. ప్రపంచ జనాభా దినం సందర్భంగానైనా ముఖ్యమంత్రి పునరాలోచించి జనాభా విషయంలో తన అభిప్రాయం మార్చుకోవాలని తులసిరెడ్డి సూచించారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య శాఖాధికారులు

## పశుగ్రాస సాగు పాడి రైతులకు లాభదాయకం

**ప్రజాశక్తి - చాపాడు**

పశుగ్రాసాల సాగు పాడి రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ తెలి పారు. శుక్రవారం మండలంలోని బద్రిపల్లె గ్రామంలో స్థానిక పశు వైద్యాధికారి ఎస్.మహమ్మద్ గౌస్ అధ్యక్షతన పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ పశుగ్రాసంలో ఏక వార్షిక, బహువార్షిక పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం నుంచి సహకారం అందుతుందన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ కె.వీరబ్రహ్మం, అసిస్టెంట్ డైరెక్టర్ సి.గురివిరెడ్డి, మండల పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


వేస్టేజ్ నుంచి ఎనర్జీ తయారయ్యే విధానాన్ని వివరిస్తున్న విద్యార్థి

## విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జి అవసరం

**కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జి చాలా అవసరమని కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్లోబల్ ఎనర్జీ ఇండిపెండెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వేస్ట్ మెటీరియల్, మనకు దొరికే ప్రకృతి సంపద ద్వారా ఎనర్జీని ఎలా సృష్టించాలనే దానిపై ప్రయోగాత్మకంగా విద్యార్థులు వివరించారు. ఇందులో సోలార్ ఎనర్జీ సాయిల్, ఎనర్జీ వేస్టేజ్ నుంచి ఎనర్జీని ఎలా క్రియేట్ చేయాలనే 15 విభాగాలను సెలెక్ట్ చేసుకుని వాటిని అందరికీ వివరించారు. ఈ నేపథ్యంలో కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడుతూ కళాశాల అటానమస్ అయిన తర్వాత నుంచి కళాశాలలో ముందుకంటే ఎక్కువగా అవగాహన ఆలోచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త విషయాల గురించి తెలి యజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శారద భవాని, జువాలజీ హెచ్ఓడి రామ్మోహన్, యాక్టివిటీ ఈవెంట్ కో-ఆర్డినేటర్స్ రాధా, రాజీవ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమస్యను అడిగి తెలుసుకుంటున్న బీటెక్ రవి

## టిడిపి పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు అభ్యున్నతి సాధించడం జరుగుతుందని పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రం పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను నోట్ చేసుకున్నారు. ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని రవి తెలిపారు. శ్రీధర్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేంపల్లె :** ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాపు వీధిలో ఇంటింటికీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలకు సంబంధించి కరపత్రాలను రామమునిరెడ్డి అందజేశారు. టిడిపి నాయకులు వేమాకుమార్, మహమ్మద్, జబిబుల్లా పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిస్తున్న చెట్లు తొలగింపు సందర్భంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు. **లింగాల :** మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఎఇ రమేష్ బాబు ఒక ప్రకనటలో తెలిపారు. ఉదయం 8 నుండి 11 గంటల వరకు మెయింటెనెన్స్ కారణంగా అంతరాయం ఏర్పడుతుందన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. **జమ్మలమడుగు రూరల్ :** శనివారం ఉదయం 8గంటగల నంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎడి రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం కావడంతో జమ్మలమడుగు అర్బన్, రూరల్, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురంలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. **ముద్దనూరు :** స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌లో అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముద్దనూరు, ఉప్పలూరు, బొందలకుంట, మంగపట్నం విద్యుత్ ఉప కేంద్రంలో పరిధిలోని గ్రామాల్లో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు, ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని ఎఇ తెలిపారు. **సింహాద్రిపురం :** మండల పరిధిలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎఇ దినేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33కేవీ జంగంరెడ్డి పల్లె ఫీడర్ మరమ్మతుల కోసం ఎల్సి తీసుకుంటామన్నారు. కోరగుంటపల్లె, అంకాలమ్మ గూడూరు, రావులకొలను, జంగంరెడ్డి పల్లె సబ్ స్టేషన్ల పరిధిలో వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారు సహకరించాలని ఆయన కోరారు.

## ఉప ఎంపిపి-2 ఎన్నికకు నోటిఫికేషన్

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిషత్ ఉప ఎంపిపి ఎన్నికకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంపిడిఓ వీర కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. చాపాడు ఎంపిపి-2 నగిర్తి సుందరమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ఖాళీ స్థానానికి ఎన్నిక అనివార్యమైంది. ఈనెల 16న ఎంపీడీఓ సభా భవనంలో ప్రత్యేక సమావేశంలో ఎంపిపి-2 ఎన్నిక జరుగుతుందని తెలిపారు. కావున సభ్యులు సమావేశానికి హాజరై ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.